# గతి

'గతి' కథలో నేల, సూర్యుడు, చంద్రుడు సాక్షిగా వాటాలుగా మారిన బతుకును చిత్రించారు. అప్పటిదాకా తోడుగా జీవనం సాగించిన వారిలో ఒకరు మరణిస్తే ఎన్నో అభద్రతల నడుమ చెప్పలేనన్ని వికారాలు బయటపడతాయి. విలువలు విధ్వంసమౌతున్న నేపథ్యంలోని సంఘర్షణల్ని చిత్రించాయి.

కుటుంబ బంధాల మధ్య చోటుచేసుకున్న పోకడల్ని కథలుగా రికార్డు చేయడం అంటే ఇదే.

- దాట్ల దేవదానం రాజు
యానాం

ఉన్నది ఉన్నట్లు చెప్తాను...

అంతా నిజమే చెప్తాను, అబద్ధం చెప్పను.

నా పేరు ధరణి. నిశ్చల అని ఇంకో పేరూ వుంది. ధరా, ధరిత్రి... వగైరా ఇంకా ఇతర పేర్లు చెప్తారు 'అమరకోశం'లో.

అయినా నాకిష్టమైన పేరు మాత్రం... నేల!

●

ఈ ఇల్లు చూడండి...

నిండా మూడు వందల గజాలు లేదు. పాత మిద్దె.

విశ్వనాథం అనీ... ఓ పంతులుది. ఎలిమెంటరీ స్కూల్లో- పాతకాలంలో- టీచరు. ఊరు పల్లెగా ఉన్నప్పటి మాట. ఆయన చెమటోడ్చి కట్టుకున్నాడు... ఈ ఇంటినీ, ఇంటి చుట్టూ అనుబంధాన్నీ. అవును- ఆయన గుండె ఈ ఇంటితో పెనవేసుకుపోయిన మమత్వం. ఈ ఇంటిపేరు అప్పుడూ, ఇప్పుడూ కూడా టీచరిల్లే!

ఇప్పుడు విశ్వనాథం లేడు. పోయి చాలా ఏళ్లయింది. ఆయన భార్య సరోజినీ, కూతురు పంకజం, పెద్దకొడుకు రంగనాథం, కోడలు స్వరాజ్యం, ఇద్దరు పిల్లలు. రెండో కొడుకు రవీంద్ర, కోడలు రాణి, ఒక పిల్ల చరాస్థిగా మిగిలారు. ఇంకో ప్రాణి చిట్టితల్లి... ఆమెని స్థిరాస్థి అనలేము, చరాస్థీ అనలేము!

ఇంట్లో ఎప్పుడూ షష్టాష్టకమే. వీళ్ళ గోల వింటుంటే గుండెలో కెలికినట్లుంటుంది. ఆ కాలంలో గుమ్మటంలా ఎదిగిన నందివర్ధనంలా కనువిందు చేసిన ఇల్లు, ఇప్పుడీ మనుషుల రాద్ధాంతాలతో పడిలేచిన పిచ్చిమొక్కలా తయారయింది. కళా, కాంతీ లేవు. దేవుడు లేని ఆలయంలా వెలితి వెలితిగా మిగిలింది.

రంగనాథం లాయరీ చేసి ఏదో కంపెనీలో ఉద్యోగంలో కుదురుకున్నాడు. ఆయన భార్య స్వరాజ్యం కూడా కాలేజీలో క్లర్క్. వాళ్ళ కూతురు చంద్రిక తొమ్మిది, కొడుకు రాజు నాలుగు చదువుతున్నారు.

రవీంద్ర మునిసిపాలిటీలో ఇంజనీరింగ్ సూపర్‌వైజర్. రాణి గృహిణి. వాళ్ళ కూతురు రజని ఎనిమిదో తరగతి.

పంకజంకి ఆరేళ్ల క్రితం పెళ్ళి చేస్తే ఆర్నెల్లలో పుట్టింటికి తిరిగొచ్చేసింది. 'నా మొగుడు శాడిస్ట్' అని ఈమె, 'నా పెళ్ళాం కరోడా, గయ్యాళి' అని మొగుడూ వాద ప్రతివాదనల్ని తెగలాక్కుని తెంపుక్కూర్చున్నారు. దీనికి రంగనాథం లాయరీ బుఱ్ఱ కూడా కారణమేనని అప్పుడప్పుడు అతని పరోక్షంగా కళ్ళొత్తుకుంటూ వుంటుంది వాళ్ళమ్మ సరోజిని. పంకజం బియ్యే అయిందనిపించింది. కానీ, తన అర్హతకి తగిన ఉద్యోగం రాలేదని ఖాళీగా కూచుంది. బుద్ధి పుట్టినప్పుడు క్లాసిఫైడ్స్ చూసి వో అప్లికేషన్ రాయి వేస్తూవుంటుంది... ఆ కంపెనీకి, ఈ కంపెనీకి! అదింకా ఏ పండుకీ తగల్లేదు!

వీళ్ళింటి రామాయణాన్ని 'కట్టె- కొట్టె- తెచ్చె'లో చెప్పాలంటే రంగనాథమూ, రవీంద్రా ఇంటిని అమ్మేద్దామని పోరు పెడుతున్నారు. సరోజినికి ఇష్టం లేదు. అందుకని కొడుకులూ, కోడళ్ళూ- తల్లి, పంకజం రెండు శత్రురాజ్యాల్లా బతికేస్తున్నారు. చిట్టితల్లిదేం వుంది- పదిహేనేళ్ల నోరూ వాయీ లేని మూగజీవం! ఆమెకో పెద్ద పేరుంది. స్పాస్టిక్ చైల్డ్! తల్లి చాటు బిడ్డ కాదు, తల్లి లోటు బిడ్డ!

సరోజిని గుండెల మీద కుంపటి చిట్టితల్లి. పాపిష్టి బతుకైపోయింది. ఈ పిల్ల వలన పడరాని మాటలూ, అవస్థలూ, ఇంట్లోవాళ్ళ నిరాదరణా, బయటవాళ్ళ చులకన చూపులూ, బాకున కుమ్మినట్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా- 'ఈ పరోక్ష మోహాల్తోనే మా జీవితాలు నాశనమై పోయినై' అనే కొడుకులూ, కోడళ్ళు. వాళ్ళ మాటలకు అనుగుణంగానే మిగిలిన పిల్లల ప్రవర్తనా కూడా వుంది. కొరకొర చూపులూ, అసహ్యపు విసుర్లూ. "ఈ

పాపిష్టిది పుట్టింది, ఇంటికి శని పట్టింది" ఇదో ఊతపదం. వినీ వినీ సరోజిని గుండె తూట్లు పడిపోయింది. ఇవన్నీ విన్నంతకాలం విని, ఇక నావల్ల కాదని వెళ్లిపోయాడు విశ్వనాథం. "ఆ మహరాజు అదృష్టవంతుడు" అంటుంది సరోజిని.

సరోజినీ, చిట్టితల్లీ నన్ను కావలించుకుని ఏడుస్తూ వుంటారు.

ఆవిడేమో గదిగుమ్మం వారగా కొంగుపరచుకొని నడుం వాలుస్తుంది... ఏ ఒంటిగంటకో. ఇంటెడు చాకిరీ ఆమెదేగా మరి!

చిట్టితల్లేమో అమ్మ పక్కగా గోడనానుకొని కూచోటమో, పడుకోవటమో. చేతులూ, కాళ్లూ వాటి ఇష్టం కదా మరి!

చెల్లెల్ని చూస్తే పంకజానికి పరమ చిరాకు. సాధ్యమైనంత వరకూ ఆమెకేసి చూడదు ఈమె. చిట్టితల్లి చర్యల్ని చూడకుండానే తల్లికి ఫిర్యాదులు చేస్తూవుంటుంది. ఆమెకీ చిట్టితల్లి పాపిష్టిదే!

పంకజం తిట్టినప్పుడు బాధకంటే రోషమొస్తుంది సరోజినికి. కొంచెంసేపు మాటా మాటా అనుకుంటారు. అదిగో... ఆ తర్వాతే సరోజిని నామీద కన్నీళ్లు కారుస్తూ తనలో తాను కుమిలిపోతూ ఉండేది.

సరోజిని అశాంతిని గమనిస్తుంటే, సన్నిహితంగా నేనూ అనుభవిస్తుంటే... నా గుండె ద్రవిస్తూ ఉంటుంది. 'రసా' అనీ, 'సర్వం సహా' అనీ నన్ను అనేది అందుకేనట.

'క్షమ' అని ఇంకో పేరు మరి!

●

నేను చూసింది చూసినట్లు చెప్తాను...

అంతా నిజమే చెప్తాను... అబద్ధం చెప్పను.

నా పేరు కర్మసాక్షి. భానుడనీ, భాస్కరుడనీ, ప్రభాకరుడనీ, దినకరుడనీ, దినమణి అనీ వంద పేర్లున్నై నాకు. అయినా నాకిష్టమైన పేరు... సూర్యుడే!

ఇప్పుడిప్పుడే నేను నడక మొదలెడ్తున్నాను.

టీచర్‌గారింటి పక్కగా నాలుగు లారీలూ, రెండు ట్రాక్టర్లూ వచ్చి నిలిచినై. మెయిన్‌రోడ్‌లో కూల్చిన ఇళ్ల తాలూకు రాయీ, రప్పా, ఇసుకా, సున్నం, ఇటుక ముక్కా చెక్కా, తుక్కూ దుమారం అంతా ఆ వాహనాల్లో నుంచి చెకచెకా కాలువ వొడ్డున కుమ్మరించేస్తున్నారు కూలీలు. ఖద్దరు జుబ్బావాళ్ళు నలుగురు- రెండు మోటార్ సైకిళ్ళ మీద వచ్చి జేబుల్లో నుంచి నోట్లు తీసి లారీల వాళ్ళకీ, కూలీలకీ అందజేసి వెళ్లిపోయారు.

అంతా అర్ధగంటలోపే జరిగిపోయిందీ పని.

ఇప్పుడు కూలీల్లో కొంతమంది త్వరత్వరగా అక్కడ పోసిన పదార్థాన్ని చదును చేసి, పారలతో అటూ ఇటూ లాగి, దిమ్మెసతో మట్టి సాపు చేసి వెళ్లిపోయారు.

ఇంతలో ఓ పెద్ద మారుతీ వచ్చింది. కారులో నుంచి ఖరీదైన మనుషులు దిగారు. చుట్టూ చూసి, ఏవేవో మాట్లాడుకుని పది నిముషాల్లో వెళ్లిపోయారు.

నేను కొంచెం పైకి లేచాను...

జనానికి కొంచెం వేడి పుట్టించాను.

రోడ్డు మీద పల్చపల్చగా జనసంచారం మొదలైంది. టీచర్‌గారింట్లోనూ మరో రోజువారీ కార్యక్రమం మొదలైంది.

అదుగో... సరోజిని వాకిలి శుభ్రం చేసి, ముగ్గులేసి వెళ్లింది. పరీక్షగా ఆ ఇంటిపక్కగా గమనించాను. రెండు ఇసుక లారీలు, ఇందాక చదును చేసిన ప్రదేశం పక్కగా విడిది చేసి వున్నాయి. రోడ్డుకి అవతలి వైపు ఆ లారీల డ్రైవర్లు, ఇసుక మీద పడుకొని వచ్చిన నలుగురు కూలీలూ చాయ్ తాగుతున్నారు. మరో అర్థగంట తర్వాత ఆ ఇసకని అక్కడ అన్‌లోడ్ చేసి వెళ్లిపోయాయి లారీలు.

నేను మరికొంచెం వేడిగా, గుర్రుగా పైకి వచ్చేసరికి –

ఆ ఇసుక దిబ్బల పక్కగా ఆడామగా కట్టుబడి పనివాళ్ళు జట్లు జట్లుగా వచ్చి నిలబడుతున్నారు. మేస్త్రీల ప్రాబల్యంలో రోజుకూలీకి పోయే సన్నకారు కూలీలు వాళ్ళంతా.

టీచర్‌గారింట్లో ముందుగదిలో ఫోన్ మోగింది.

రంగనాథం తీశాడు. వింటున్నాడు. అతని మొహంలో కలవళపాటు. "అట్టాగే... అట్టాగే..." అని విధేయతగా క్షణం క్షణం పెద్దగా చెప్తున్నాడు. ఫోన్ పెట్టేసి తమ్ముణ్ణి పిలిచాడు. చేతిలో పేపర్‌తో వచ్చాడు రవీంద్ర.

"చూడు... ఆ శివానందం ఫోన్ చేస్తున్నాడు. బిల్డర్ చాలా ఖచ్చితంగా చెప్పాట్ట. ఈ వారంలో తేలిపోవాలి డీల్ అంటున్నాట్ట. లేకపోతే, తన మార్గం తాను చూసుకుంటానని ఖరాఖండీగా చెప్పాడుట. ఈ వచ్చే నాలుగు రాళ్లూ తీసుకుంటే మంచిది. నా మాట విని వొప్పుకోండి. లేకపోతే సొమ్మూ పోతుందీ, శని పడుతుంది' అని సలహా ఇస్తున్నాడు" చెప్పాడు రంగనాథం.

"అందుకేగా మనం సిద్ధంగా వున్నది! మరి, ఆవిడగారేమో భీష్మించుకు కూర్చుండె. తనకు తోచదు. చెప్తే వినదు. అమ్మ పెట్టదు, అడుక్కు తిననీయదు... అన్నట్లుంది!" విసుక్కున్నాడు రవీంద్ర.

వీళ్ళిద్దరి సంభాషణంతా వినిపిస్తూనే వుంది సరోజినికి. క్షణంలో సగంసేపు ముందుగది కేసి చూసి, వంటింట్లోకి నడిచింది ఆమె.

"రాత్రికి ఇవ్వాళ ఈ విషయం తేల్చేయాలి!" అంటూ తానూ తన గదికి వెళ్లాడు రవీంద్ర.

"మీరిట్లాగే మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోండి. చివరికి ఆ బిల్డర్ తన మజిల్ పవర్‌తో మనల్ని బయటకి సాగనంపుతాడు. చిప్పాజోలే రెండూ పోతై!" అంటూ వచ్చింది స్వరాజ్యం.

కిటికీలోని పాతగుడ్డ తీసుకొని స్కూటర్ తుడుచుకోవడానికి కదిలాడు రంగనాథం.

గది గుమ్మంలో నిలబడి గొంతెత్తి తన పాట తాను పాడుతూనే వుంది స్వరాజ్యం. పెరట్లో భర్తకీ, లోపలి సభ్యులకీ అందరికీ వినిపిస్తూనే వుంది... ఆ సన్నాయి మేళం!

●

చల్లటి ప్రకృతి సాక్షిగా చెపుతున్నాను...

నేను చూసింది చూసినట్లుగానే చెప్తాను... అంతా నిజమే చెప్తాను, అబద్ధం చెప్పను.

నా పేరు శశి. సుధాంశుడనీ, కళానిధి అనీ, నిశాపతి అనీ- సవాలక్ష పేర్లూ వున్నాయి నాకు. అయినా నన్ను చంద్రుడంటేనే వెలిగిపోతాను, మురిసిపోతాను!

●

టీచర్‌గారింట్లో హాలు...

మధ్యవర్తి శివానందం, రంగనాథం, రవీంద్ర, సరోజినీ- కుర్చీల్లో కూచుని వున్నారు. స్టూలు మీద పంకజం, స్వరాజ్యం, రాణీ... గోడవారగా- బెంచీ మీద తునకలు తునకలుగా నేనూ హాల్లో వాలాను!

విషయం ప్రస్తావించాడు శివానందం. తెలిసిందే అయినా మళ్లీ వివరంగా చెప్పాడు-

"మాటలు సాగినై. బిల్డర్‌కి అంతో ఇంతో దైవభీతి వుంది. అందుకనే మీ పరిస్థితి చెప్తే బాగానే మెత్తపడ్డాడు. నా మొహం చూసి ఏడున్నరకి సరేనన్నాడు. ఐదు భాగాలు. ఒకటిన్నర తీసుకోండి, లేదా ఒక అపార్ట్‌మెంట్ ఇచ్చి ఒక లక్ష ఇస్తాడు. మీ ఇష్టం. మీ అమ్మగారికి చిట్టితల్లి గార్డియన్‌గా ఒక భాగమన్నమాట. పంకజం కూడా డాక్యుమెంట్స్ మీద సంతకం చేయాలి."

శివానందం చెప్పింది విని అందరూ మొహమొహాలు చూసుకున్నారు. కొద్దిసేపు గాలి స్థంభించింది.

"చెప్పమ్మా..." అన్నాడు రంగనాథం.

వెంటనే ఠపీమని స్వరాజ్యం చెప్పింది -

"ఆమె చెప్పేదేముంది ప్రత్యేకంగా? అనుకుంటున్నట్లుగా డబ్బు తీసుకుందాం. రవీంద్రకీ, రాణీకి కూడా అదే ఇష్టం."

"అవును" అన్నాడు రవీంద్ర ముక్తసరిగా.

"నాకేం అభ్యంతరం లేదు" అంది పంకజం.

'మబ్బులు కమ్ముకున్న ఆకాశానికి అరచేయిని అడ్డుపెట్టగలనా?' అనిపించింది సరోజినికి. 'అసలు వీళ్ళ ఆలోచన ఏమిటి? ఇంటితో అనుబంధం, అమ్మమాట- ఇవన్నీ పక్కన బెట్టినా ఆ నాలుగు రాళ్లూ తీసుకుని ఏం చేద్దామనుకుంటున్నారు? తానూ, ఇద్దరు ఆడపిల్లలూ ఎక్కడ తలదాచుకోవాలి? ఏమిటీ వీళ్ళ ఆంతర్యం? నాలుగు రోజుల్లో హరించుకుపోయే ఆ లక్షన్నరతో వాళ్ళకైనా ఏమిటి ఉపయోగం?'

సరోజిని ఆలోచనల్లో శతకోటి జవాబులేని ప్రశ్నలు!

"ఏమిటో తేల్చండి మరి!" హెచ్చరించాడు శివానందం. గోడ గడియారం వైపు చూశాడు. తొమ్మిది దాటింది.

కొడుకులిద్దరూ తల్లివైపు చూశారు.

ఆమె మొహంలో ఏ భావమూ లేదు. వేదాంతిలా కూచుని వుంది. వేరే లోకాల్లోకి చూస్తున్న కళ్ళు!

"మరి, ఈ ఆడపిల్లలూ, నేనూ..?" అని సాలోచనగా పెదవి విప్పింది.

"దానికంత ఆలోచనేం అక్కర్లేదు. మిమ్మల్నేమీ రోడ్డు మీద వదిలెయ్యలేముగా!" నిష్ఠూరంగా అన్నది స్వరాజ్యం.

"అవును. అక్కడో ఆర్నెల్లూ, ఇక్కడో ఆర్నెల్లూ గడిపితే సరి. లేదా పంకజంకి ఉద్యోగం వస్తే ముగ్గురూ వో గూట్లోకి చేరవచ్చు!" రాణి అభిప్రాయం లాంటి సలహా.

సరోజిని మౌనం అర్ధాంగీకారంగా సమావేశం ముగిసింది.

ఆమె మామూలుగా తీసుకునే అల్పాహారం కూడా తీసుకోలేదు ఆ రాత్రి. ఎప్పుడో నిద్రపట్టబోయే ముందు తనలో తాను గొణుక్కుంది –

"డబ్బు పాపిష్టిది!" అని.

●

మళ్లీ మొదటికొచ్చాననుకోకండి... నేనే- నేలని!

నాలుగు రోజుల్లోనే నన్ను కాగితాల్లో బిగించేసి, కావలసిన వాళ్ళ సంతకాలు తీసేసుకొని చేతులు మార్చేశారు. తన నుంచి దూరమవుతున్నందుకు పాపం... సరోజిని మాత్రం లోలోపలే కుమిలిపోయింది.

ఆ వారంలోనే మూటా ముల్లె సర్దుకుని బయటకొచ్చిందీ సంసారం. ఒక్క కుటుంబం కాస్తా రెండు కుటుంబాలైపోయాయి. రంగనాథం ఒక ఇంట్లో, ఆ ఇంటికి పది కిలోమీటర్ల దూరంలో ఇంకొక ఇంట్లో రవీంద్ర అద్దెకొంప వాసులైపోయారు.

సరోజినీ, పంకజం, చిట్టితల్లి మొదటి ఆర్నెల్ల కింద జేష్ఠభాగానికి పోయారు!

●

నేనే సూరీణ్ణి చెప్తున్నాను...

ఈ ఆర్నెల్లలోనూ– ఆ ఖర్చనీ, ఈ ఖర్చనీ, మందులనీ, మాకులనీ అమ్మ దగ్గర బాగానే దండుకున్నారు... రంగనాథం, స్వరాజ్యం– ఓ పాతికవేల పైమాటే!

ఈ మాట రవీంద్రకి చేరవేసింది పంకజం.

రవీంద్ర, రాణి బయటపడకుండా సమయం కోసం కాచుక్కూచున్నారు.

ఆర్నెల్లు కాగానే, మర్నాడు–

నేనింకా నా ప్రయాణం మొదలుపెట్టకముందే అమ్మనీ, చెల్లెళ్ళనీ తమ్ముడింటికి పంపించేశాడు రంగనాథం.

"మధ్యాహ్నం వెళ్తాం లేరా!" అని తల్లి యధాలాపంగా అంటే, విరుచుకుపడింది స్వరాజ్యం– "మాటంటే మాటే! ఈ పూట తిండి ఖర్చు మేమెందుకు భరించాలి?" అని.

సరోజిని బిక్కచచ్చిపోయింది. తన బతుకు మీద తనకే రోత పుట్టింది.

"వచ్చారూ... రండి, రండి! నిండా పొద్దు పొడవకుండానే తయారు– పాపిష్టి మొహాలు!" అంటూ స్వాగతించింది రాణి.

గుండెల్లో గునపాలు దించినట్లయింది సరోజినికి.

"ఇక్కడికి చేరినప్పట్నుంచి ఆమెకి అస్వస్థత, జబ్బు, రోగం!" రాణి మాటల్లో.

డబ్బు గుంజడానికి ఇదో పెద్ద కారణమని లోలోపల సంతోషిస్తున్నా జీతభత్యాలు లేని పనిమనిషి పనికిరాకుండా పోయిందనే బాధ, కోపం, కసి, వాగ్బాణాలు చేసి ప్రయోగించడం మొదలెట్టింది రాణి.

రెండు నెలల్లోనే పంకజంకి ఉద్యోగం వచ్చింది– ఏదో స్కూల్లో రిసెప్షనిస్ట్‌గా. మరో నెలలోగానే ఒక టీచర్‌ని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. ఈ కబురు చల్లగా నలుగురి చెవిన వేసి భర్త దగ్గరికి వెళ్ళిపోయింది.

ఇంట్లో రభస, చర్చా బాగానే సాగినై.

అమ్మా, చెల్లీ బాధ్యత కొడుకులదే కానీ, మాదెట్టా అవుతుందని తెగేసి చెప్పేశారు పంకజం, ఆమె భర్తా. •

ఈ పరిణామాలతో మంచం పట్టిన సరోజిని- చిట్టితల్లి గురించిన దిగులుతో చిక్కి శల్యమైంది.

ఒకరోజు ఉదయాన్నే దిగులు దిగులుగా నేను పైకొచ్చేసరికే సరోజిని హంస లేచిపోయింది. ఆ రోజు మళ్లీ నేను కొండల వెనక్కి పోయేవరకూ ఆ ఇంట్లో యాగీ సాగుతూనే వుంది. ఆమె సొమ్ముని ఎవరెంత పంచుకోవాలో తేలక కొట్టుకుచచ్చారు రంగనాథం, రవీంద్ర!

పెద్ద మనుషుల జోక్యంతో చివరికి నేను సముద్రంలో క్రుంగే వేళకి ఇంట్లో శవం లేచింది.

●

అవును... నేనే- చంద్రుణ్ణి చెపుతున్నాను...

జోరున వర్షం, హోరుగాలి, కారుమబ్బులు, చీకటీ... సరిగా కనపడడం లేదు. మసక మసగ్గా మెరుపులు మధ్యగా.

అదుగో... అక్కడ చూడండి. కారులో నుంచి దిగుతున్నారు కదూ- వాళ్ళే రంగనాథం, రవీంద్ర. ఆ మూడో ప్రాణి చిట్టితల్లి. ఆమెని చేతులు పట్టుకుని దించారు.

ఆ గేటు చూశారుగా... ఆ భవంతి- మెంటల్లీ రిటార్డెడ్ వాళ్ళ శరణాలయం...

ఆ గేటు ముందు చిట్టితల్లి!

చాలా స్పీడుగా వెళ్లిపోయింది కారు.

ఫ్రేము లేని ఫోటోలా చిట్టితల్లి- అవును... వర్షంలోనే! అయినవారికే లేని కనికరం వాన కెందుకు వుండాలి?! కుంటిప్రశ్నలు వేయకండి!

రోడ్డుకి ఆవలివైపు గుడిసెల్లో ముష్టిదాని రెండు గాజుకళ్ళు. విద్యుల్లత విరిస్తే నాకు అగుపించింది. "పాపిష్టిది... పాపిష్టిది!" అని పలవరిస్తున్నట్లున్న పగిలిపోయిన పెదవుల కదలిక!!

మరేం అనుకోనంటే అడుగుతాను-

'పాపిష్టిది చిట్టితల్లంటారా? మరేమైనా వుందా?!'

●

' నవ్య ' వారపత్రిక ... 11 ఏప్రిల్ ' 2007 సంచికలో ప్రచురితమైన కథ